క్లుప్తంగా

రక్తదానం

కొత్తపేట: స్థానిక వివేకానంద యోగా శిక్షణా కేంద్రం సభ్యులు అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేశారు. మండపేటకు చెందిన నడింపల్లి అనంత లక్ష్మికి కడుపులో కణితులు పెరగడంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో జాయిన్ కాగా శస్త్ర చికిత్స సమయంలో అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి వచ్చింది. ఆమె కుటుంబ సభ్యులు వివేకానంద యోగా శిక్షణా కేంద్రం మాస్టర్ ఆకుల శ్రీనివాస్‌ను సంప్రదించారు. ఆయన తన శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న శిష్యులను అమలాపురం బుద్ధాల నాగరత్నం మెమోరియల్ వలంటరీ బ్లడ్ సెంటర్‌కు తీసుకువెళ్లి రక్తదానం చేయించారు. శ్రీనివాస్‌కు, రక్తదాతలకు అనంతలక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా వనువులమ్మ జాతర


వనువులమ్మ తల్లి

అంబాజీపేట: చిరతపూడిలో వేంచేసిన వనువులమ్మ అమ్మవారి జాతర శనివారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జాతర సందర్భంగా ఆలయాన్ని రంగులతోను, విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతరలో గరగ నృత్యాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవారి తీర్థం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

అనధికార కుళాయిల తొలగింపు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అనధికార తాగునీటి కుళాయిలను తొలగిస్తున్నారు. మూడు రోజుల క్రితం అక్రమ కుళాయిల తొలగింపు పనులు మొదలు పెట్టారు. గ్రామంలో శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అక్రమ కుళాయిలను తొలగిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి కోటయ్య, సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి శనివారం తెలిపారు. గ్రామంలో సుమారుగా 50కి పైగా అనధికార కుళాయిలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. కుళాయిలకు మోటార్లు అమర్చి వాటి ద్వారా తాగునీటిని ట్యాంకులకు మళ్లిస్తున్నట్లు గుర్తించారు. వీటిని తొలగించిన పక్షంలో శివారు ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అక్రమ కుళాయిల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు.

అవ్వాతాతలకు ఉచిత కంటి పరీక్షలు

మామిడికుదురు: వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా శనివారం పాశర్లపూడి గ్రామ పంచాయతీలో అవ్వా తాతలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. దీనిలో భాగంగా అప్టమాలజీ అధికారి హుస్సేన్ ఆధ్వర్యంలో 100 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో కంటి శుక్లాలు సమస్యతో బాధపడుతున్న వారిని శస్త్ర చికిత్స కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి పంపించారు. దీంతో పాటు ఇదే గ్రామ పంచాయతీలో ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత ఆధ్వర్యంలో పలువురికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న రోగి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ పి.ఇందిర, హెల్త్ అసిస్టెంట్ కె.సూర్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ పీఎస్‌వీఎస్ వర్ధంతి

సఖినేటిపల్లి: అంతర్వేదికరకు చెందిన ప్రముఖ దాత డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ వర్ధంతి శనివారం కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సైకిల్‌షాపు సెంటర్లో ఆయన విగ్రహానికి కుమారులు నాగేంద్రకుమార్, లక్ష్మీనారాయణ, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు వేశారు. వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, డి.సువర్ణలనాయుడు ఆధ్వర్యంలో ఆలమూరు-2, కలవచర్ల, పినపళ్ల, సంధిపూడి తదితర గ్రామాల్లో చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలు వేశారు.

బ్లూ మార్చ్‌కు అనుమతులు లేవు

రావులపాలెం: స్థానిక రావులపాలెం సెంటర్ ఆదివారం జరపనున్న బ్లూ మార్చ్‌కు పోలీసుల తరపున ఎటువంటి అనుమతులు లేవని ఎస్సై ఎం.వెంకటరమణ శనివారం తెలిపారు. బ్లూ మార్చ్ వల్ల పొలిటికల్ గ్రూప్స్‌గా ఏర్పడి ప్రజా శాంతికి భంగం కలిగే విధంగా ఉన్నందున, నేషనల్ హైవేపై వాహనాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున ఈ బ్లూ మార్చ్ ర్యాలీకి అనుమతులు ఇవ్వలేకపోతున్నామన్నారు. ఈ విషయాన్ని గమనించి పోలీస్ వారికి సహకరించాలని ఎస్సై కోరారు.

రెవెన్యూ డివిజన్ టీమ్‌కు క్రికెట్ కిట్ బహూకరణ

కొత్తపేట: కొత్తగా ఏర్పడిన కొత్తపేట రెవెన్యూ డివిజన్‌లోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్ డివిజన్ క్రికెట్ టీమ్‌కు శనివారం దాత క్రికెట్ కిట్‌ను బహూకరించారు. వెదిరేశ్వరానికి చెందిన దండు సూరిబాబురాజు రూ.56 వేలతో సమకూర్చిన క్రికెట్ కిట్‌ను ఆర్డీవో ముక్కంటి చేతుల మీదుగా టీమ్ సభ్యులకు అందజేశారు.

పదిలో విద్యార్థుల విజయదుందుభి

- ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ
- విజేతలను అభినందించిన ప్రజాప్రతినిధులు


పి.గన్నవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

కొత్తపేట: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి మొత్తం 901 మంది పరీక్షకు హాజరు కాగా 659 మంది (73 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 674 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 443 మంది (66 శాతం), 9 ప్రైవేట్ పాఠశాలల నుంచి 227 మందికి 216 మంది ఉత్తీర్ణులైనట్టు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తెలిపారు.

పి.గన్నవరంలో 74 శాతం..

పదో తరగతిలో పి.గన్నవరం మండలంలో 74 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. మొత్తం 821 మంది విద్యార్థులు 604 మంది ఉత్తీర్ణులయ్యారని ఆమె వివరించారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండల స్థాయిలో పి.గన్నవరం పాఠశాల నుంచి ప్రథమ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే చిట్టిబాబు అభినందించారు. వారికి స్వీట్లు తినిపించారు. హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య కుమార్, కొక్కిరి రవికుమార్, దొమ్మేటి దుర్గారావు, పాఠశాల అధ్యాపక సిబ్బంది తదితరులు విద్యార్థులను అభినందించారు.

పదిలో 65.5 శాతం ఉత్తీర్ణత

అంబాజీపేట: మండలంలోని 9 జెడ్పీ హైస్కూళ్లకు సంబంధించి పదిలో 65.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ జీవీ కనకదుర్గ శనివారం తెలిపారు. 464 మంది పరీక్షలకు హాజరుకాగా 304 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.

ఆత్రేయపురంలో 62 శాతం

ఆత్రేయపురం: మండలంలో పదో తరగతి పరీక్షల్లో 62 శాతం ఉత్తీర్ణత సాదించినట్లు ఎంఈవో వరప్రసాద్ పేర్కొన్నారు. 631 మంది విద్యార్థులకు గాను 392 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులను, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జెడ్పీటీసీ బోణం సాయి బాబు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, ఎంపీడీవో నాతి బుజ్జి, ఎంఈఓ వరప్రసాద్ అభినందించారు.

రావులపాలెంలో 56.29 శాతం ఉత్తీర్ణత

రావులపాలెం: పదో తరగతి ఫలితాలు శనివారం విడుదల కాగా రావులపాలెం మండలంలో తొమ్మిది ప్రభుత్వ హైస్కూళ్లలో 700 మంది పరీక్షలు రాయగా 394 మంది ఉత్తీర్ణత సాధించి 56.29 ఉత్తీర్ణత నమోదైనట్టు ఇన్‌చార్జి ఎంఈఓ ఎం.సుబ్బరాజు తెలిపారు.

సఖినేటిపల్లి మండలంలో..

సఖినేటిపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బాలికలు నిలచినట్లు మోరి హెచ్ఎం, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ కన్వీనర్ మద్దాలి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: మండలంలో మొత్తం 12 స్కూళ్ల నుంచి 532 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 316 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. 59.40 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. బాలికలు 63 శాతం మంది, బాలురు 54.89 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఆలమూరులో 54.23 శాతం ఉత్తీర్ణత

ఆలమూరు: మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 627 మంది విద్యార్థులకు గాను 340 మంది (54.23) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులను, విద్యార్థులను ఎంఈవో మురళీ సత్యనారాయణ అభినందించారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని పదకొండు ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాఠశాలల పదో తరగతి పరీక్షల్లో 77 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఎంఈవో జేవీకే దుర్గ తెలిపారు. పరీక్షలకు హాజరైన వారిలో 719 మందికి ప్రభుత్వ విద్యార్థుల్లో 531 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో తెలిపారు.

సంక్షేమ పాలనను మరోసారి ఆశీర్వదించండి

- కొమరాజులంక, పెదపట్నంలో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు


కొమరాజులంకలో లబ్ధిదారులకు పథకాల లబ్ధి వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి


పెదపట్నంలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

రావులపాలెం: అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా పని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కోరారు. శనివారం మండలంలోని కొమరాజులంక సచివాలయం-1 పరిధిలో కనకదుర్గా గుడి ఏరియా, సంజయ్ కాలనీ, రజకుల కాలనీ, వెంకటేశ్వరస్వామి గుడి వీధి, హనుమాన్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమాన్ని వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ కర్రి గోవిందకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరై ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వెంట తిరిగారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి అందిన ప్రభుత్వ పథకాలు లబ్ధిని వివరిస్తూ వారికి పత్రాలను అందజేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి మరలా ఎన్నికల్లో మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాకా ప్రసన్నకుమార్, కోనాల రాజు, గాడి క్రిస్టఫర్, కోఆప్టెడ్ ఎంపీటీసీ అజహర్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సెక్రటరీ నిమ్మకాయల బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే అజెండాగా..

మామిడికుదురు: ప్రజల సంక్షేమమే ప్రధాన అజెండాగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం పెదపట్నంలో మూడో రోజు కొనసాగింది. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. తాగునీటి కుళాయిల ఏర్పాటు, హౌసింగ్ రుణాల మంజూరు, డ్రైనేజ్ నిర్మాణం తదితర సమస్యలను స్థానికులు ప్రస్తావించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని చిట్టిబాబు భరోసా ఇచ్చారు. ఇళ్లు కట్టుకునే ప్రతి ఒక్కరికీ ఇంటి రుణాలు మంజూరు చేస్తామన్నారు. వీటితో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తూచ తప్పకుండా అమలు చేశామని చిట్టిబాబు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సంక్షేమం మరింత పరుగులు పెట్టాలంటే జగన్‌కు ప్రజలు ఆశీస్సులు అందించాలని చిట్టిబాబు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల దుర్గాభవాని, జేసీఎస్ మండల కన్వీనర్ జక్కంపూడి వాసు, సోషల్ మీడియా కో-కన్వీనర్ బళ్ల కీర్తిరైనా, గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ముల చిన్న, పార్టీ నేతలు బత్తుల అశోక్, కొండేటి స్టాలిన్‌బాబు, గోగి క్రాంతికుమార్, తులా గోపాలకృష్ణ, కుసుమ శ్రీధర్, చింతా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ సొసైటీగా అభివృద్ధి చేయాలి


ఎమ్మెల్యే చిట్టిబాబు, చైర్మన్ ఆదినారాయణలను సన్మానిస్తున్న పార్టీ నాయకులు, గ్రామస్తులు

అంబాజీపేట: రైతులకు మెరుగైన సేవలు అందించడంతో ఆదర్శవంతమైన సొసైటీగా అభివృద్ధి చేసి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. పుల్లేటికుర్రు సొసైటీ నూతన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షుడు నందుల ఆదినారాయణతో పాటు సభ్యులు నాగాబత్తుల శ్రీనువాసరావు బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారి ఆర్థిక పురోభివృద్ధికి సహకరించాలన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి తడిసి రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్య పడవద్దన్నారు. అంతకుముందు ఆదినారాయణ ఇంటి వద్ద నుంచి భారీ ర్యాలీగా సొసైటీ వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, కొర్లపాటి కోటబాబు, దొమ్మేటి సత్యమోహన్, కొండేటి వెంకటేశ్వరరావు, విత్తనాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఔదార్యం


రావులపాలెం ఆస్పత్రిలో క్షతగాత్రునికి ఆర్థిక సాయం చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రునిపై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. రూ.45 వేలు సాయం అందజేశారు. కొత్తపేట శివారు పెదరాముడు నూతి మెరకకి చెందిన దొంగ రామకృష్ణ విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడి రావులపాలెంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక పార్టీ నాయకుల ద్వారా క్షతగాత్రుడి గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే రావులపాలెంలో అతను చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అతని పరిస్థితి గురించి వైద్యులను ఆరా తీశారు. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులను తెలుసుకుని తీవ్రంగా చలించారు. మానవతా దృక్పథంతో తన వంతుగా రూ.25 వేలు అందజేశారు. జగ్గిరెడ్డి వెంట రాష్ట్ర పార్టీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, కొత్తపేట పీఏసీఎస్ పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన భరత్

మలికిపురం: అమలాపురం మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టిబ్బాయి తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు కుడుపూడి భరత్ శనివారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును కలిశారు. ఈ మేరకు కత్తిమండ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి

పి.గన్నవరం: నాగుల్లంక గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కోట వీవీ సత్యనారాయణ (54) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన 2001 నుంచి 2006 వరకూ ఎంపీటీసీగా పని చేశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నార్ని వీవీ సత్యనారాయణ, పమ్మి అర్జునరావు తదితరులు సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు

పి.గన్నవరం: బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఊడిమూడిలో శనివారం జరిగిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో చిట్టిబాబు పాల్గొన్నారు. ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు.

కోనసీమ రైల్వే లైన్ సాధనకు సమష్టి కృషి అవసరం


అంబాజీపేటలో మాట్లాడుతున్న రిటైర్డ్ న్యాయమూర్తి వెంకట ప్రసాద్

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిలిచిపోయిన రైల్వే లైను పనుల సాధనకు అందరి సమష్టి కృషి అవసరమని కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధులు ఈఆర్ సుబ్రమహ్మణ్యం, కల్వకొలను తాతాజీ, సప్పా నాగేశ్వరరావులు అన్నారు. అంబాజీపేట కోనసీమ కోప్రా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో మన కోనసీమకు రైలు కోసం శాంతియుత ప్రజా ఉద్యమంపై చర్చా వేదిక శనివారం నిర్వహించారు. కోకోఫెడ్ కన్వీనర్ అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ చర్చా వేదికల్లో పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా రైల్వే లైన్ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోనసీమ కోప్రా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శ్రీరామకృష్ణ, మేడిద శ్రీనివాసరావులు అన్నారు. రానున్న రోజుల్లో కోనసీమ రైల్వే సాధన కోసం శాంతి యుత ర్యాలీ చేయాలని తాతాజీ పిలుపునిచ్చారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా)పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని వక్తలు అన్నారు. అముడా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కోర్టు ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రణాళిక రచించాలని రిటైర్డ్ న్యాయమూర్తి పులిదిండి వెంకట ప్రసాద్ సూచించారు. అనంతరం పలు తీర్మానాలను చర్చా వేదికలో ఆమోదించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, కోకోఫెడ్ ప్రతినిధులు ఆదిత్య కిరణ్, దాసరి వీవీ సత్యనారాయణ, బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, పబ్బినీడి రాంబాబు, పితాని ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల మైత్రీ సమ్మేళనం


మోరి ఉన్నత పాఠశాలలో మైత్రీ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


సఖినేటిపల్లి: మోరి జాన సుబ్బమ్మ మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం 1985-86 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అపూర్వ మైత్రీ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో వారంతా ఈ సమ్మేళనంలో భాగస్వాములయ్యారు. ఇదే బ్యాచ్‌కు చెందిన పాఠశాల హెచ్ఎం మద్దాలి వెంకటేశ్వరరావు సమ్మేళనానికి సహచర మిత్రులకు స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన ప్రముఖ వైద్యనిపుణుడు జేవీబీ ప్రసాద్ నిర్వహించారు. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి సదరు బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. చదువుకున్న రోజుల్లో తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. ఆద్యంతం ఆహ్లాదంగా, ఆనందంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తరగతి గదుల్లో పాఠాలు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. కళా చంద్రశేఖర్, ముప్పర్తి శ్రీను, చింతా నేతాజీ, ఆకుల చినవెంకన్న నాయుడు, వలవల వీరకనకం, ఉప్పుగంటి విశ్వనాథం, మాలే సత్యనారాయణ, వలవల దొరబాబు, పెండ్లికట్ల శ్రీనివాసరావు, పోతురాజు కళాధర్ పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి


మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: వేసవి సీజన్‌లో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ తగిన కృషి చేయాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రజాప్రతినిధులకు సూచించారు. భవిష్యత్తులో జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న ప్రాజెక్ట్‌ల ద్వారా పుష్కలంగా ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతర్వేదిలో చేపడుత్ను భారీ తాగునీటి ప్రాజెక్ట్ ద్వారా తీర ప్రాంత గ్రామాలకు తాగునీటి కొరత లేకుండా ఉంటుందన్నారు. కళ్లాల్లో ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ శాఖ చూడాలని ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా ఎంపీడీవో జి.భీమారావు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమాల గురించి ఏవో పీవీ నరసింహారావు వివరించారు. అలాగే విద్యాశాఖ ద్వారా నాడు నేడు పథకం పనులపై ఎంఈవో నల్లి మనోహరం సభ్యులకు వివరించారు. వీటితో పాటు ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే పనుల గుంచి ఆ శాఖ అధికారి వివరించారు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని వైద్యాధికారుల వివరించారు. 15వ ఆర్థిక సంఘ నిధులు, జనరల్ ఫండ్ కలిపి 69 వర్క్సుకు సభ ఆమోదం తెలిపింది. అలాగే 2023-24 యాక్షన్ ప్లాన్ వెబ్‌సైటులో నమోదుకు సభ ఆమోదించింది. వైస్ ఎంపీపీ-1, 2 రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చినరాజా, రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, ఉపాధ్యక్షుడు సుంకర సత్యప్రసాద్, తహసీల్దార్ వై.రామకుమారి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఐసీడీఎస్, డ్రెయిన్స్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తడిసిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేస్తాం


తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని మిల్లర్లకు పంపుతున్న ఆర్డీఓ ఎం.ముక్కంటి తదితరులు

అయినవిల్లి: అకాల వర్షానికి తడిసిన మెలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుందని రైతులు అధైర్య పడవద్దని ఆర్డీఓ ఎం.ముక్కంటి తెలిపారు. ఆయనతో పాటు ట్రైనీ కలెక్టర్ జి.వెంకటేష్ కూడా ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పంటచేలలో ఉన్న అకాల వర్షానికి తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమీక్షించారు. రైసుమిల్లర్లతో, ట్రాన్స్‌పోర్టర్లతో ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి వై.శోభను ఆదేశించారు. మొలకెత్తిన, తడిసిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయించి మిల్లర్లకు ఆయన దగ్గరుండి తరలించారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు తదితరులు ఉన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: అకాల వర్షాల వల్ల తడిసిపోయిన రబీ పంట ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేస్తామని తహసీల్దార్ ఐపీ శెట్టి, ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం పర్యటించి తడిసిన ధాన్యం రాశులను పరిశీలించి రైతుల పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి ఇప్పటికే నివేదికను అందజేసినందున రైతులు నిరుత్సాహపడవలసిన అవసరం లేదన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో నెలకొల్పిన ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గోనెసంచుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని క్షేత్ర వ్యవసాయ సహాయకులను వారు ఆదేశించారు. ఆర్ఐ ఎం.జానకీరాఘవ, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు పాల్గొన్నారు.

అంబాజీపేట: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేసి ఆదుకుంటామని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. గంగలకుర్రులో మిల్లుకు తరలిస్తున్న ధాన్యం లోడును, రాశులను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొత్తపేట డివిజన్ పరిధిలో 12,716 మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లో ఉందన్నారు. రావులపాలెంలో 2 వేలు, ఆత్రేయపురంలో 400, ఆలమూరులో 3,500, పి.గన్నవరంలో 16 వేలు, అంబాజీపేటలో 1,000, అయినవిల్లిలో 1,500, కొత్తపేటలో 2,500ల మెట్రిక్ ధాన్యం కళ్లాల్లో ఉందన్నారు. వీటిపై రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని, అన్ని విధాలా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తహసీల్దార్ టి.మంగతాయారు, ఏవో విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, ఆర్ఐ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం


మడికిలో సత్యవతి కుటుంబానికి సాయం అందిస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సేవాసమితి సభ్యులు

ఆలమూరు: మండలంలోని మడికి గ్రామానికి చెందిన దేవరపూడి సత్యవతికి చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన విషయం విదితమే. పేద కుటుంబానికి చెందిన ఆమెకు భర్త, కొడుకు లేకపోవడంతో భర్త లేని తన పెద్దకూతురితో కలసి జీవిస్తుంది. ఈ నేపథ్యంలో ఆమె దాతల సాయాన్ని అర్థించింది. దీంతో స్పందించిన రావులపాలేనికి చెందిన శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి స్పందించింది. ఈ మేరకు సత్యవతి కుటుంబానికి గృహనిర్మాణ నిమిత్తం రూ.పది వేల ఆర్థిక సాయాన్ని అందించి తమ సహృదయాన్ని చాటుకుంది. దీంతో స్థానికులు ఆ సేవా సమితి సాయానికి అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆలమూరులో అనారోగ్యంతో బాధపడుతున్న గండేటి దుర్గ కుటుంబానికి 1989 బ్యాచ్‌కి చెందిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.42,800 సాయం అందించారు.

ఘనంగా ఈశ్వరాంబ వర్ధంతి

పి.గన్నవరం: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి మాతృమూర్తి ఈశ్వరాంబ వర్ధంతిని వాడ్రేవుపల్లి కమ్మ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈశ్వరాంబ దినోత్సవం సందర్భంగా రాజోలు, మలికిపురం సబ్ జోన్‌ల పరిధిలోని బాల వికాస్ సెంటర్ల గురువుల ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల వికాస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ అలరించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా సేవా సమితి జిల్లా నాయకులు అడబాల కొండబాబు, వి.పాపయ్య పంతులు, బిక్కిన వీరాస్వామి, కాసిన ప్రభాకర్, ఎం.నర్సింహారావు, నెక్కంటి లక్ష్మి, ఫలదాంబ, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో స్టాల్స్‌కు టెండర్లు

కొత్తపేట: స్థానిక కొత్తపేట బస్‌స్టేషన్‌లో ఆటోమొబైల్స్ షాపుకు టెండర్ నిమిత్తం అనుభవం కలిగిన, ఆసక్తి ఉన్న వ్యాపార సంస్థలు, వ్యాపారుల నుంచి ఫీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల ఎనిమిదో తేదీ నుంచి 23వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట వరకు రావులపాలెం డిపోలో అందుబాటులో ఉంచుతామన్నారు. పూర్తి చేసిన టెండర్లను 23 ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొత్తపేటలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్సులో వేయాలన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్‌దారుల సమక్షంలో టెండర్లు తెరుస్తామన్నారు. ఏ కారణంతోనైనా టెండర్లు అంగీకరించడానికి, తిరస్కరించడానికి రద్దు చేయడానికి ఆర్టీసీకి పూర్తి అధికారం ఉందన్నారు.